వాన వచ్చిన రాత్రి

బయట కొబ్బరిచెట్టు, నిస్సహాయంగా పొడుగైన ఆకులు ఆడిస్తో అస్పష్టంగా కనబడుతున్నాయి. అంతటా అలుముకుపోయిన బూడిదరంగుతో ఆకాశం అస్పష్టంగా కనబడుతోంది. గదిలో మరీ చీకటిగా మరీ చల్లగా ఉంది. సూర్యుడు ఎప్పుడు అస్తమించాడో తెలియదు. రాత్రి ఎప్పుడు వచ్చిందో చెప్పడం కష్టం. మధ్యాహ్నం నించీ చీకటి పడుతోనే ఉంది. వానపడుతోనే నల్లటి చూరు క్రింద మాత్రమే చినుకుల విసురు ఏటవాలుగా కనబడుతోంది. ఎదురు ఇంటిముందంగా వాన ఒకటే శ్రుతిలో వినబడుతోంది. మధ్య మధ్య మేఘాలు గొణుక్కుంటున్నాయి. అవతల అప్పుడప్పుడు తడి కొబ్బరి ఆకులు కొంచెంగా మెరుస్తున్నాయి. ఒక కొబ్బరి మట్టమీద ఒక కాకి ఒంటరిగా సోమరిగా కూర్చుంది. మధ్య మధ్య రెక్కలు దులుపుకుంటో! అది కావుమనడంలేదు. వానవెలిసి పోలేకపోతుంది.

నేను కిటికీకి దగ్గరగా దుప్పటీ కప్పుకొని కూర్చున్నాను. లేచి దీపాన్ని వెలిగించాలన్న ఊహ మనస్సులో తట్టి వెంటనే అడుక్కిపోతోంది. అన్ని వూహలూ అలాగే అడుక్కి పోతున్నాయి. నీళ్ళలో తాబేళ్ళలాగా, ఆ ఏటవాలు చినుకులు రెప్పవెయ్యకుండా చూస్తున్నాను. కొంతసేపటినుంచి అవీ కనబడటంలేదు. ఎదురు ఇంటి చూరుకింద చీకటి అంతటా అలుముకుపోయింది.

కొబ్బరిమట్టమీద కాకి ఎగిరి అవతల అరుగుమీద వాలింది. "కావు! కావు!" మంది, రెక్కలు దులుపుకుంది. చూరుకింద దండెంమీద వాలింది. దండెం వూగింది. కాకి "కావు! కావు!" మంది. "ఎవరో చుట్టాలు వస్తారు." అని ఊహ తేలబోయి మునిగిపోయింది. దూరంగా ఉన్న చుట్టాలు జ్ఞాపకంవచ్చి పోతున్నారు - నీళ్ళలో తాబేళ్ళలాగ.

ఎదురు ఇంట్లో దీపం వెలిగింది. వానచినుకులు అస్పష్టంగా వెలిగిన కిటికీ అంతమేరా కనబడుతున్నాయి. ఎవరో కిటికీ వెనక ఆదుర్దాగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆ బొంగురు గొంతుక నాకు పరిచితమయినదే. ఆ మందరస్థాయీ నేను వింటోవున్నదే. ఆ 'బొంగురి'కి భార్య ఆ 'మందరస్థాయి'. ఈవేళ ఇంకో మూడోగొంతు, సన్నాయిలా వినబడుతోంది.

కాకి మళ్ళీ "కావు కావు" మంది. "ఎవరో చుట్టాలు"... అనుకున్నాను. మళ్ళీ చుట్టాలకోసం మనసులో ఎక్కడో కాకి "కావు కావు" మన్నట్టు అనిపించింది. ఎంతో ఒంటరిగా అనిపించింది. దుప్పటీ కొంచెం గట్టిగా కప్పుకున్నాను. అంత చలివెయ్యకపోయినా, 'జంయి' మని ఒక గాలి వీచింది. కిటికీదాకా జల్లుకొట్టింది.

ఇంటిముందు సందులోనుంచి ఒంటెద్దుబండి చలిచేత గజగజలాడుతో "దుర్‌దుర్" అంటో వెడుతోంది. ఎద్దు కాళ్ళ చప్పుడు తడి నేలమీద తప తప మంది. ఎదటి గోడలో

తలుపు తెరుచుకుంది. ఒక్కసారి సందు రప్పున వెలిగింది. కొద్దిగా చూరునీళ్లు దారాల్లా జారుతున్నాయి. వాటిలోంచి చూస్తే ఎదటి గుమ్మానికి దోమ తెరవేసినట్టుంది.

"ఏయి! బండీ!" అన్నాడు బొంగురు.

"బాబో!" అంది బండి –

"జగన్నాథపురం బండి కడతావా?"

"కట్టనండి బాబో."

"పోనీ నీ యిష్టం వచ్చినంత పుచ్చుకో."

"ఎంతిచ్చినా వొద్దండయ్యా! ఈ గాలి, వానా ఈ పొద్దూ, దుర్ – దుర్..." బండి వెళ్ళిపోయింది.

బొంగురు తటపటాయిస్తో కొంతసేపు గుమ్మంలో నిలబడి తరవాత లోపలికిపోయి తలుపు మూసుకున్నాడు.

"ఎల్లా గెడతారండి? బళ్ళు దొరకవిప్పుడు?" అన్నాడు బొంగురు.

"ఎల్లాగోనండీ" అంది సన్నాయి.

"పోనీ ఈ మూల పక్కలేస్తాను. ఈ రాత్రికి ఇక్కడ పడుకోవే. ఎల్లా లేకపోతే!" అంది మందరస్థాయి.

"వంటిల్లంతా వాన! దొంగముండ! ఇల్లు నేయించమని ఎన్నోసార్లు చెప్పాను. నెలొచ్చేసరికి అద్దెకోసం మాత్రం తయారు" బొంగురు చిరాకుగా అన్నాడు.

"ఎల్లాగ మరీ?"

"ఎల్లాగ మరీ?"

వాన జోరుగా పడుతోంది. కాకి దండెంమీద "కావు కావు" మంది. ఒంటరిగా, అరుగుకింద మెట్లమీద అడుగులు చప్పుడూ, గజగజా వినబడ్డాయి.

"చుట్టాలు" అనుకుని ఉలికిపడ్డాను.

"కుర్రోడు! కుర్రోడు!" గరగర మంది ఒక మగగొంతు. "పర్లేదురా" అంది ఒక ఆడ కిచకిచ.

రెండు మూర్తులు అరుగు ఎక్కాయి. గరగరకు గడ్డం ఉన్నట్లు ఎదటి కిటికీ వెలుగులో అస్పష్టంగా కనబడింది. మెడలో పెద్ద జోలి. కిచకిచ చంకలో ఒక కుర్రవాడు నిద్రపోతున్నాడు. అరుగుమీద మూలగా సద్దుకున్నారు.

"ఇంటో దీపం నేదు ఎవరూ లేరేమో" గరగర అన్నాడు.

"నిద్దరోయాడు కుర్రోడు" కిచకిచ అంది.

"మూలగా తొంగోమెట్టు."

"ఎదవ్వోన! ఎంచే వుంటదో?"

"ఇయ్యాలింక సత్రంకాడి కెల్లలేం."

"ఈ మా పిక్కడే తొంగుందాం."

వానచప్పుడు చీల్చుకు చటుక్కున సన్నాయి గొంతు ఎదటి ఇంటిలోంచి వినబడింది.

"ఎల్లాగే ఇక్కడ చిక్కడిపోయాను?"

దండెంమీద కాకి రెపరెప లాడింది. దండెం వూగింది.

"కాకిరోయి!" అంది కిచకిచ.

"వోన" అన్నాడు గరగర.

"కాక్కి సలేత్తదా?"

"మనలా సలేత్తె సచ్చిపోదో?"

వాన శ్రుతి ఎక్కించి ఒక్క క్షణం కురిసింది. అరుగుమీదకి ఒక జల్లుకొట్టింది. అరుగుమీద మూర్తులు గజగజ లాడాయి.

"ఉంగ్రో – ఉండేశ!" కిచకిచ కిచకిచలు పెట్టినట్టు నవ్వింది.

"స లెల్లా పోద్ది మరీ?" సగం నవ్వులో గరగర అన్నాడు.

నేను దుప్పటీ ఇంకా దగ్గరగా కప్పుకున్నాను. గదిలో ఎక్కడో "టప్, టప్" అని చినుకుల చప్పుడు సమతాళంలో చాలాసేపటినుంచి వినబడబోయి ఇప్పటికి వినబడింది. ఎటో మాత్రం తెలియలేదు.

"ఆ మెల్లకన్నుమ్మెట్టిందిరా ఇంతబువ్వ" అంది కిచకిచ.

"పాతగుడ్డలు కుర్రోడిక్కప్పు."

"ఇయ్యాలో పెద్దగుడ్డ ఓ బాబిచ్చాడ్రా!"

"ఎవరెశే?"

"ఆ మేడలో సదువుకునే బాబురా."

"ఎందు కుచ్చుకున్నా?"

"ఏం?"

"ఎన్నాళ్ళమట్టి సూత్తున్నా ఆ బాబుని?"

"లేదెశే, అంతా అనుమానమే నీకు–– అంతా నావంక సూత్తే – – నీకు కోపం గాదట్రో?" వేళాకోళంగా కిచకిచ అంది.

"తొనలుదేరిన ఆడదాన్ని అందరికీ సూడాలనుంటది. నువ్వు జాగ్రత్తుండాలి – సదువుకునే కుర్రోళ్ళకాడ ఏముచ్చుకోక."

"తొనలు దేరమటే నా కెక్కువ ముద్దెడతారంతాను."

కొంతసేపు నిశ్శబ్దం – వానచప్పుడు తప్ప. ఆ మూర్తులు అరుగు మీద నడుము వాల్చిన ధ్వని.

ఎదటి ఇంటి బొంగురు గొంతుక: "పోనీ, ఆ మూల మీరిద్దరూ పడుకోండి, నేనిల్లా గుమ్మం దగ్గర వేసుకుంటాను."

మందరస్థాయి : "ఎల్లాగండీ?"

సన్నాయి "ఎల్లాగ? ఇక్కడ చిక్కుపడి పోయాను." పారాగదిలో ఏమూలో చినుకులు "టప్‌టప్" పడుతున్నాయి. బయట కొబ్బరి ఆకులు గలగలమన్నాయి. పెద్ద చినుకుల జల్లు పెద్ద చప్పుడు చేసింది. చలిచేత అరుగుమీద గజగజ.

"సలేత్తందిరా." కిచకిచ.

"సలేం టేశే, పీకిదాకా మెక్కి! ఇంకా దగ్గరగా జరుగు" గరగర బిగిసిన పళ్ళమధ్యనించి అన్నాడు.

"జల్లొత్తందిరా."

"తూరుపొనలు – ఎదర వొరసలో జల్లుండదు."

"కడుపు నిండుగుంటే – కొంచెం సలేత్తుంటే" కిచకిచ గొంతుకి ఏదో రహస్యం చెపుతున్నప్పుడులాగ.

"ఈ వా నెల్చిపోతే–"

లోపలినించి – ఆకలిగ నా గొంతుక్కి ఏదో అడ్డుపడింది. చలికీ – ఆకలికీ – పడదు. దుప్పటీ మంచం మీదకి గిరవటేశాను. ఇందాకటినుంచీ వేస్తోన్న ఆకలి ఇప్పటికి జ్ఞాపకం వచ్చింది. రబ్బరుజోడు తొడిగి పంచిపైకి దోపి గొడుగు తీసుకుని అరుగుమీదికి వచ్చాను.

"అయ్యగోరున్నారింట్లో" గరగర.

తలుపు తాళం వేసి గొడుగు తెరచి రోడ్డుమీదికి దిగాను. దారి జారుతోంది. చేతిలో గొడుగు ఒణుకుతోంది. ఒక అరుగుమీద కర్ర తలుపుల మధ్యనించి కొంచెం వెలుగూ, కుట్టుమిషనుయొక్క వానవంటి జోరు వస్తున్నాయి. ఇద్దరు ఒకే తువ్వాలు కప్పుకొని చెట్టాపట్టాలు వేసుకొని పళ్ళు టకటక మనిపిస్తో పోతున్నారు.

హోటలు గుమ్మాలు యెక్కి గొడుగు ముడిచాను. నేల అంతా తడికాళ్ళతో తడిసింది. యెలెక్ట్రిక్ దీపాలచుట్టూ దోమలు దెబ్బలాడుతున్నాయి. విస్తరి దగ్గర కూర్చున్నారు.

నా ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి అతని స్నేహితునితో అన్నాడు. "ఇంకా మీవాళ్ళు రాలేదుటోయి?"

"వాస్తే ఈ హోటలు కర్మం యెందుకూ?"

"ఋతువు మారిందోయి!" ఇద్దరూ నవ్వారు.

ఎదురువరసలో విద్యార్థులు ఇద్దరు పరధ్యానంగా భోజనం చేస్తున్నారు.

"మన లాడ్జిలో అంతా వానేరా! రాత్రి ఎల్లాగోగాని" ఒకడన్నాడు.

"రెండో ఆటకు సినీమాకు పోదాం ఏరా?" రెండోవాడు.

"ఏమిటీవేళ?"

"ఏదో టార్జాన్‌ఫిల్మ్‌లా ఉంది."

నేను తొందరగా భోజనం ముగించి లేచాను. ఎదటి విద్యార్థులూ నాతోటే లేచారు. కుళాయిదగ్గర ముందు నేను చెయ్యి కడుక్కుంటో ఉన్నాను.

"దసరాకి తప్పకుండా ఇంటికి పోయి రావాలిరా, ఈ హోటలు తిండి – ఇదీ –" విద్యార్థులు అనుకున్నారు.

నాకు ఆకలి తీరినట్టులేదు. పెరుగు కమ్మగా ఉంది చల్లగా లోపలికి వెళ్లినా, ఎంచేతో చలి కొంచెం తగ్గింది.

"కడుపు నిండుగుంటే –– కొంచెం సలేత్తుంటే––" అన్న మాటలు మరుపులోనుంచి జ్ఞాపకంలోకి వచ్చాయి.

అలవాటుపడిన రోడ్డు వెంబడి ఇంటికి బయలుదేరేను.

తాలూకాఫీసులో కొట్టిన ఎనిమిది గంటలు వాన చప్పుడు మీద తెగి వినబడ్డాయి. ఇంకో లోకంలోనించి వచ్చినట్టు. వానచప్పుడు తప్ప తక్కిన చప్పుళ్ళన్నీ – ఇంకో లోకంలోనించిలా వినబడుతున్నాయి. ఒక అరుగుమీద రెండు మేకలు పడుకుంటో లేస్తో అశాంతిగా ఉన్నాయి. చినుకుల తెరను చీల్చుకుని ఒక కారుయొక్క కళ్ళవంటి దీపాలు నెమ్మదిగా సమీపం వస్తున్నాయి – రెండు ప్రక్కలికీ బురదనీ, నీటిని చిమ్ముకుంటో వచ్చి వీడి మీద పడుతున్నట్టుగా. ఒక ఇంటి మెట్టుమీదకి ఎక్కి జాగ్రత్తగా నిలబడ్డాను. చూరునీళ్ళు బరువుగా గొడుగుమీద పడ్డాయి. గొడుగూ, నేనే దడదడ లాడాము. కొంచెం ఎర్రటి

రోడ్డు బాడి చిమ్మింది, నా పంచమీద మరకలు పడ్డాయి. కారు వెళ్ళిపోవడంతోటే రోడ్డు కారు చీకటి అయిపోయింది. చూరు ప్రక్కనే నిలబడి సిగరెట్టు ముట్టించాను. పొగ హాయిగా వెచ్చగా గుండెల కిందదాకా దిగి పైకి వచ్చేస్తోంది. ఏదో అద్భుతమయిన సంబంధం ఉంది ఈ వానకీ, చల్లటి కమ్మటి పెరుక్కి. ఈ సిగరెట్టు వెచ్చని మత్తుకీ, పీల్చినప్పుడల్లా యెర్రగా వెలిగి సజీవుడయిన స్నేహితునిలా అనిపించింది, సిగరెట్టు. నాకు ఒక్కసారి గొడుగు ముడిచీ రోడ్డుమీద కుర్రవాళ్ళ తలకాయల మీదనించి గెంతుకుంటో పరుగులెత్తాలనిపించింది. కాని నేను పరుగెత్తలేదు.

అరుగుమీదకి యెక్కి గొడుగు ముడిచి తాళం తీశాను. "ఆ – అ – మ్మే. అరుగుమీద మూడవగొంతు నిద్రలో పలవరించింది.

'శ్ శ్ శ్ శె' నెమ్మదిగా కిచకిచ జోకొట్టింది. అప్రయత్నంగా నేను ఆ పక్కకి చూసాను. ఆ చీకటిలో మూడు మూర్తులూ అస్పష్టంగా, పుష్టిగా ఒకళ్ళనొకళ్ళు అదుముకొని చలిని నిర్లక్ష్యంగా చేస్తో పడుకున్నారు. తొనలు దేరిన ఆమె ముఖం గుర్తుపట్టడానికి ఆ చీకటిలో సాధ్యంకాలేదు. అగ్గిపుల్ల గీసి ఆ చలిచీకటుల అద్వైతాన్ని భంగపరచడానికి నాకు సిగ్గువేసింది.

ముడిచిన గొడుగునించి ఏకధారగా నీరు కారి అరుగుమీద ఒక గీతలా పాకి కింద పడిపోతోంది. ఆ చీకటిలో యెక్కడో దాగిన కొంచెం వెలుగు ఆ తడిగీతమీద పడి అద్దంమీదలా కొంచెం మెరుస్తోంది.

ఒక్కక్షణం అల్లా ఆగి లోపలికి వెళ్ళాను. తలుపు దగ్గరగా మూసి అగ్గిపుల్ల గీశాను. పొడుగుపాటి నీడలు గోడలమీద వంకరటింకరగా ఆడాయి. చిన్న కోడిగుడ్డు దీపం వెలిగించి, బాగా తగ్గించి గోడకి తగిలించాను. సగం తడిసిన బట్టలు ఆరవేశాను.

తలుపు తెరుచుకుంది. గాలేమో ననుకున్నాను.

'గుడ్‌నైట్ సార్–' బొంగురు గదిలోకి వచ్చాడు! 'మీరు భోజనానికి వెళ్ళినట్టున్నారు. అబ్బ! ఏం వానండీ, తెగమొత్తుతోంది."

బొంగురు నాతో మాట్లాడడానికి అదే మొదటిసారి. మేము ఎదురింటి వాళ్ళమయినా' మా పరిచయం మా భార్యలద్వారానే.

"మాకు కొంచెం ఇబ్బంది వచ్చిందండీ ఈ వేళ" బొంగురు తను వచ్చిన పనికి ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు. గొంతుక తగ్గించి అన్నాడు. 'ఆవిడ చూశారూ, ఆ సన్నగొంతుకావిడ, మధ్యాహ్నం తయారయింది మా యింటికి. మా ఆవిడకి చిన్ననాటి స్నేహితురాలు. నిన్నే వచ్చి జగన్నాధపురంలో దిగారట. ఈవేళే చూడ్డానికి తయారయింది, ఏమంత మించిపోయిందో! ఆవిడ వచ్చింది మొదలు ఇందాకా కాస్త తెరిపి అయినా లేదు' కొంచెం పొడుం ఎడమచేతులో వేసుకొని. కుడిచేతి వేళ్ళలో పట్టుపట్టాడు. ఎడమ చేతిని టపటపా దులిపాడు. 'ఆవిణ్ణి పంపిచేద్దామంటే ఎక్కడా బండి దొరకలేదు... మా వంటిల్లంతా వాన. గదిలో ఓ పక్క కురుస్తోంది. రాత్రి ఎల్లా తెల్లవారుతుందోగాని.' నేను పక్క దులిపి పక్క వేసుకున్నాను. శాలువా దులుపి మడతపెట్టి మంచంమీద పెట్టాను. చలిగా ఉన్నా నాకెందుకో ఉక్కగా అనిపించింది. ఆ బొంగురు రావడంతోటే గదిలో గాలి వేడెక్కిపోయినట్టుగా చిరాకుగా మంచంమీద కూర్చున్నాను. బొంగురు పచారు

చేస్తున్నాడు. ఆయన నీడ ఆయనకంటే లావుగా, పొడుగ్గా వేగంగా గోడమీద పచారుచేస్తోంది.

'అల్లా కూర్చోండి' అన్నాను నేను.

ఏదో జ్ఞాపకం వచ్చినట్టు బొంగురు ఆగి నరాలు ఒక క్షణం బిగబట్టి ఒక్క పీల్పుతో పొడుం అంతా పీల్చి ముక్కు దులుపుకున్నాడు. తరువాత కిటికీ దగ్గర కుర్చీలో కూర్చున్నాడు.

'మా ఆవిడాను ఆవిడాను ఆ గదిలో పడుకోవాలి. కొంచెం నేను ఈ రాత్రికి మీ యింట్లో... పడుకోడానికి..."

'అల్లాగే, మీ పక్కా, అదీ తెచ్చుకోండి" అన్నాను నేను.

"తెచ్చుకుంటానండీ బాబూ! మహ చెడ్డ కష్టమండి. చుట్టమైవచ్చి ఏదో అయి పట్టుకుందన్నట్టు... అయ్యో! అదీగాక ఎల్లాగండీ? ఎల్లాగండీ! అంటో కూర్చుంటే ఇవతల వాళ్ళకి మనస్థిమితం ఉండాలా బాబూ?... నాకు మహా చెడ్డ..." ఇంకో పొడుం పట్టు పీల్చి ఇప్పుడే వస్తానండి. పక్క తెచ్చుకొని అని వెళ్ళిపోయాడు.

నాలో చిరాకు వర్షపు హోరు హెచ్చింది. దీపపు వెలుగులో నా మంచం పక్కని టపటప పడుతున్న చినుకులు కనబడ్డాయి. చిన్న కాలవగట్టి గోడలో ఉన్న తూముదాకా వంకరటింకరగా ప్రవహిస్తోంది నీరు, మంచం మీద నడుమువాల్చాను. శాలువా కప్పుకున్నాను. వానహోరు వినాలనుకోకుండానే వింటున్నాను.

వాన హోరు అలాగే విధివిరామం లేకుండా వినబడుతోంది. సన్నాయి గొంతు. ఎల్లాగే? ఇక్కడ చిక్కడిపోయాను..."

బొంగురు గబగబా తలుపు తెరచి లోపలికి వచ్చాడు. 'అబ్బా! మహ దారుణంగా కొడుతుంది వాన... అరుగుమీద ఎవరో పడుకున్నారండోయి పాపం... ఈ మూల వేసుకోనాండి? – శ్రీరంగ రంగా!.. ఆపదుద్ధారక!... అమ్మయ్య! తలుపు వేశెయ్యనాండి!' ఆయన తలుపు వేసి వచ్చి వాల్చిన పక్కమీద పడుకున్నాడు.

'శ్రీరామం భజశరణం... యుద్ధ వార్తలు ఏమిటండీ! జపాన్‌వాడు మన మీద పడతాడంటరా? ఏం యుద్ధమోగాని బాబూ ప్రాణాలు తెంచుతోంది. ఎన్నాళ్ళోగాని ఇది... శ్రీరామం భజ శరణం – అమ్మయ్య! అమ్మయ్య! శ్రీత చింతామణిమ్."

ఆయన్ని చుట్టచుట్టి పరుపుతో సహా అవతలికి గిరవాటెయ్యాలనిపించింది కాని, నేను కళ్ళుమూసుకుని నిద్ర నటించాను. బొంగురు ఏదో మాట్లాడుతోనే ఉన్నాడు ఆత్మకథ.

'ప్రాణాలు తెంచుతారు. మంచీ చెడ్డా ఉండాలి కాస్త. అందులో ఆడ పీనుగులయితే మహ చెడ్డ కష్టం... శంభో... శంబో.. నిద్రపోయారా నిద్రపట్టిందిగావును..."

నాకంటే ముందుగా ఆయనకే నిద్రపట్టింది. ఏదో చిరాకు నాలో నిద్రపట్ట నియ్యలేదు. ఈ వాన – ఇంత ఒంటరిగా నేను ఈ యింట్లో. గుర్రుపట్టి నిద్రపోతో పక్కని బొంగురు.

సన్నాయి గొంతు ఆగిఆగి వినబడుతోంది 'ఎల్లాగోగాని–'

'జల్లు తగ్గిందిరా' కిచకిచ సగం నిద్రగొంతుకతో అంది.

ఆమె ముఖం ఎల్లా ఉంటుందో చూడాలని ఎంతో కుతూహలం కలిగింది. ఆ రాత్రి ఆమె వింతగా, కొత్తగా, ఎప్పుడూ ఎరగని ప్రాణిలా అనిపించింది. వాన కురుస్తోంటే అంత సంతృప్తిగా ఉండే జీవిని నేను ఊహించుకోలేకపోయాను.

'ఎలాగే... ఇంటిదగ్గర...'' సన్నాయి నిట్టూర్పు విడిచింది.

ఆమె ముఖం ఎల్లాఉంటుందో చూడాలనిపించలేదు. ఆమెను నేనెపుడు చూచి ఉండను. కాని ఆ రాత్రి ఆమె ఎంతో ఎరుగున్న మనిషిలా అనిపించింది – ఆ ఒంటరితనం, ఆ ఆదుర్దా.

రెండుఎలుకలు కీచుమంటో ఇంకో లోకంలో జీవుల్లాగా వాటి నీడలతో కలసి చటుక్కుని గదికి అడ్డంగా పరుగెత్తాయి. ఇంటికప్పు చిల్లులుపడి టపటప పడుతోన్న చినుకులు మళ్ళీ ప్రాణం పోసుకు వినబడ్డాయి.

అన్ని ఆలోచనలూ నాలో నీడల్లా అలుముకుపోతున్నాయి. ఈ గదిలో బొంగురూ నేనూ... ఇద్దరమూ ఒంటరిగా. కాని మా ఇద్దరి ఒంటరితనానికి సామరస్యం లేదు. ఒకదాన్ని ఒకటి ఎదుర్కుని అశాంతి పుట్టిస్తాయి... ఎదటి ఇంటి గదిలో సన్నాయి. మందరస్థాయి – ఒకరి హృదయపు ఆవరణలోకి రెండో హృదయం అడుగుపెట్టలేదు. ఎవరి అశాంతి వారిదే, ఎవరి చిరాకు వారిదే.

గోడనున్న దీపం రప్పుమంటే గోడలమీద నీడలు పొడుగ్గా పొట్టిగా సాగాయి గాలికి కదిలే నల్లటి చీరల్లాగ. అరుగుమీద నిశ్చింతగా నిద్రిస్తోన్న వాళ్ళ శాంతి చల్లగా అప్పుడప్పుడు మెల్లగా గదిలోకి వ్యాపిస్తోంది. కాకి దండెంమీద సమాధిలో ఉంది.

ఆలోచనలు చెదిరిపోతున్నాయి వానచప్పుడు జోకొడుతోంది... కిచకిచ ఒత్తిగిలింది... నా ప్రయాణానికి సద్దుకుంటోన్నాను... సన్నాయి 'ఎల్లాగండీ'' అంది జాలిగా... అంతటా నిండిపోయింది ఓ ఆర్తనాదంలా 'ఎలాగండి?' అని ... అన్నీ 'ఎల్లాగండీ'' అన్నాయి... రైలు పెట్టెలో ఒక్కణ్ణీ... వాన... చటుక్కుని పక్కబల్లమీద సన్నాయి 'ఎల్లాగ?'... ఒక అవతారంలాగ – మా ఆవిడా నేనూ బండిమీద వస్తున్నాం: – తొనలు దేరిన ఆమె అగపడి ముష్టి అడిగింది – మా ఆవిడ చిరాకుపడింది – నా గది తెరిస్తే – ఎవరూ!! – బొంగురు కాదు – సన్నాయి అక్కడ పడుకుంటా!! ఎల్లాగ?' – 'ఎల్లా' – 'ఏ––ల్లా'.

మొగంమీద ఎవరో మొట్టినట్టు అనిపించి ఉలికిపడి లేచాను. నుదురు తడిగా ఉంది. ఎడమకంటిమీదుగా చెక్కు మీదికి నీరు కారింది. తలగడా మీదికి నీరు కారింది. తలగడా మీద టప్‌టప్ చినుకులు పడుతున్నాయి. క్రమంగా మసగ విడి మెలుకువ వచ్చింది. మంచందిగి పక్కకి ఈడ్చాను. మూసిన కిటికీ తెరిచాను. బొంగురు వెళ్ళిపోయాడు. వెలుగు పశుత్వంలా కళ్ళమీదికి వచ్చిపడింది. కాకులన్నీ లేచి కావు కావు మంటున్నాయి.

ఆదుర్దాగా అరుగుమీదికి వచ్చాను. అరుగు ఖాళీ, నిద్రకళ్ళు నులుపు కున్నాను ఖాళీ! చేతులారా ఏదో పోగొట్టుకున్నట్టు అనిపించింది. కాకులన్నీ ఒకటే గోల ''కావుకావు'' మని వాన కురుస్తోంది.

●